అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే..

చార్మినార్: ఎన్నికల బరిలో నిలిచిన వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలేదీ నేడే. గత నెల 30న జరిగిన పోలింగ్ మజ్లిస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంబీటీ, బీఆర్‌ఎస్‌ల మధ్య నువ్వా..నేనా..? అన్న రీతిలో జరిగింది. ఆదివారం జరిగే కౌంటింగ్‌కు అంతా సిద్ధమయ్యారు.

- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8.30 గంటల నుంచి మొదటి రౌండ్ ప్రారంభం

చార్మినార్ కౌంటింగ్‌కు అంతా సిద్ధం..

నాంపల్లిలోని కమలా నెహ్రూ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌లో చార్మినార్ నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 202 పోలింగ్ స్టేషన్లలో 15 రౌండ్లలో 14 టేబుళ్ల ద్వారా ఎన్నికల కౌంటింగ్‌ను నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లన్నీ సిద్ధం చేశారు. దాదాపు 100 మంది కౌంటింగ్ సిబ్బంది పాల్గొననుండగా..150–200 మంది వివిధ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లకు అనుమతి కల్పించారు. పోలింగ్ ఏజెంట్లందరూ రిటర్నింగ్ అధికారి జారీ చేసిన కౌంటింగ్ పాస్‌తో పాటు ప్రతి ఏజెంట్ మరో గుర్తింపు కార్డును వెంట ఉంచుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ ఏజెంట్ల కోసం ప్రత్యేక దారులను ఏర్పాటు చేశామని.. సెల్‌ఫోన్లు, కెమెరాలను అనుమతించేది లేదని చార్మినార్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకన్న తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రారంభమవుతుందని.. అనంతరం 8.30 గంటల నుంచి ఫస్ట్ రౌండ్ కౌంటింగ్ మొదలవుతుందన్నారు. నియోజకవర్గంలో గత నెల 30న జరిగిన పోలింగ్‌లో 97830 ఓట్లు (43.26 శాతం) పోలయ్యాయని ఇందులో 53169 మంది పురుష ఓటర్లు కాగా.. 44,646 మహిళ ఓటర్లు,15 ఇతర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

గోషామహల్ ఎన్నికల కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు..

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో పోల్ అయిన 1,49,857 లక్షల ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం ప్రారంభం కానుంది. కోఠి ఉమెన్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపుకు భారీ ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారి ఆర్ విక్టర్, ఏఆర్‌ఓలు మన్నె ప్రేమ్‌కుమార్, బాలయ్యలతో పాటు ఇతర అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. కౌంటింగ్ హాల్‌లో పలు పార్టీల ఏజెంట్లకు, కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాట్లు చేపట్టారు.

14 టేబుళ్లు..17 రౌండ్లు..

నియోజకవర్గ ఓట్ల లెక్కింపును 14 టేబుళ్ల ద్వారా లెక్కిస్తున్నట్లు ఆర్‌ఓ విక్టర్ తెలిపారు. 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ల అనంతరం ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో 411 మంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన వివరించారు.


కౌంటింగ్ ఏర్పాట్ల గురించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఆరున్నర గంటలకే అభ్యర్థులు, ఏజెంట్లు రావాలి..

పోటీ చేస్తున్న పలు పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, స్వతంత్ర అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఆదివారం ఉదయం ఆరున్నర గంటల లోపు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. అందరి ముందు స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

సెల్‌ఫోన్ల అనుమతి లేదు..

కౌంటింగ్ హాల్ లోపలికి సెల్‌ఫోన్ అనుమతి లేదని ఆర్‌ఓ విక్టర్ వివరించారు. సెల్‌ఫోన్లు, భద్రపరిచేందుకు కౌంటింగ్ హాల్ బయట ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ హాల్ లోపల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిగా సీసీ కెమెరాల ద్వారా చిత్రీకరిస్తామన్నారు. దాదాపు 250 మంది సిబ్బందితో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు ప్రత్యేక అబ్జర్వర్‌గా మాలిని ముపోపాధ్యాయ వ్యవహరిస్తారని ఆయన వివరించారు.

మాసబ్‌ట్యాంక్ జేఎన్టీయూలో..

నాంపల్లి: మాసబ్‌ట్యాంక్ జేఎన్టీయూలోని 63–నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. నియోజకవర్గంలోని 604 పోస్టల్ బ్యాలెట్లను అరగంటలో లెక్కిస్తారు. అనంతరం 8.30 గంటలకు సాధారణ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మొత్తం 20 రౌండ్ల కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ 285 ఈవీఎం మిషన్లు ఉన్నాయి. శనివారం నాంపల్లి నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కౌంటింగ్ అబ్జర్వర్ లాల్‌రామ్ సంగ్, మధ్య మండలం డీసీపీ శ్రీనివాస్ హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చాంద్రాయణగుట్టలో..


సూర్యప్రకాష్, ఆర్‌వో

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాష్ తెలిపారు. నిజాం కాలేజీలోని డీఆర్‌సీ కేంద్రంలో 321 పోలింగ్ బూత్‌లకు గాను 14 టేబుళ్లలో 23 రౌండ్ల వారీగా లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు ఈ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. నియోజవర్గంలో మొత్తం 3,37,815 మంది ఓటర్లకు గాను 45.26 శాతం నమోదై 1,52,898 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇందులో 78,523 మంది పురుషులు, 74,371 మంది స్త్రీలు, నలుగురు ఇతరులు ఉన్నారన్నారు.


కౌంటింగ్ సెంటర్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు


చార్మినార్ కౌంటింగ్‌కు సిద్ధమైన అధికారులు


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్‌ఓ విక్టర్, ఏఆర్‌ఓలు మన్నె ప్రేమ్‌కుమార్, బాలయ్య

ప్రజా పక్షాన నిలుస్తున్నందుకే మజ్లిస్‌కు ఆదరణ


మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా పక్షాన నిలుస్తున్నందుకే మజ్లిస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన హకీంపేట్‌లోని తన కార్యాలయంలో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్‌లో గతనెల 30న జరిగిన ఎన్నికలపై చర్చించారు. మజ్లిస్ పోలింగ్ ఏజెంట్లు సమర్థవంతంగా పని చేశారని, వారందరికి ఆయన అభినందించారు. కార్పొరేటర్లు కూడా ఎప్పటికప్పుడు తమ డివిజన్‌లలో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గంలో ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందన్న విషయం మరోసారి ఈ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరూపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, ప్రముఖ ఫొటో గ్రాఫర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ జబ్బార్, జహంగీర్‌బేగ్, ఆలీముద్దీన్, అఫ్సర్ తదితరులున్నారు.

దివ్యాంగులకు ఆత్మస్థైర్యం ఎక్కువ


దివ్యాంగుడి టైలర్‌షాపులో ఎంపీ ఇంతియాజ్ జలీల్

గోల్కొండ: దివ్యాంగుల కుఆత్మస్థైర్యం ఎక్కువ అని అందువల్లే వారిలో చాలా మంది తమ కాళ్లపై తాము జీవించగలుగుతున్నారని ఔరంగాబాద్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండలోని జెడ్‌టీ టైలరింగ్ షాపును సందర్శించారు. ఈ షాపు నిర్వహిస్తున్న హైదరాబాద్ హ్యాండిక్యాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ జాహేద్‌ను ఆయన అభినందించారు. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం లేకుండా షాపును నిర్వహిస్తున్న మహ్మద్ జాహేద్‌ను ఆయన అభినందించారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు కృషి చేయాలని తెలంగాణ టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయంలో నవభారత్ నిర్మాణ్ ఫౌండేషన్ రూపొందించిన ఎయిడ్స్, హెచ్‌ఐవీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపకుండా వారికి చేయూతనందించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాల అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, కేఆర్ రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వహీద్, నవీన్, మహ్మద్ జీషాన్‌లు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నాం'


మహ్మద్ సలావుద్దీన్ లోధి

చార్మినార్: ఈసారి జరిగిన ఎన్నికల్లో చార్మినార్ నుంచి పోటీ చేసిన తనకు ఓటు వేసిన ఓటర్లందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బీఆర్‌ఎస్ చార్మినార్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధి అన్నారు. సీఎం కేసీఆర్ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మూడోసారి సీఎం అవుతారన్నారు. ఆదివారం వెలువడనున్న ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్


అన్నపూర్ణ ఆలయం వద్ద పారిశుద్ధ్య పనులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ అభివృద్ధికి తాము ఎప్పుడూ కృషి చేస్తున్నానని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఆలయం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఆయ న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం వద్ద చెత్త డంపింగ్ కాకుండా నివారించేందుకు సెక్యూరిటీ గార్డును నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, జొన్నకుంటి మధుసుదన్, దేవీశంకర్, వెంకటేశ్వర్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ తదితరులున్నారు.

శబరిమలకు చేరుకున్న అయ్యప్ప భక్తులు



అబిడ్స్: మహా పాదయాత్ర ద్వారా నగరం నుంచి తరలివెళ్లి అయ్యప్ప స్వాములు శబరిమల చేరుకున్నారు. అక్టోబర్ 26న లక్ష్మణ్ గురుస్వామి, క్రాంతి కన్నె స్వామి, హేమంత్ గురుస్వామి, రాజేష్ గురుస్వామి, రాజు ప్లాలెం గురుస్వాములతో పాటు మొత్తం 47 మంది అయ్యప్పస్వాములు పాతబస్తీ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో పూజలు చేసి మహా పాదయాత్రతో బయల్దేరారు. 37 రోజుల పాటు కాలినడకతో పాదయాత్రగా వెళ్లిన అయ్యప్ప స్వాములు శనివారం శబరిమలకు చేరుకున్నారు.

25 కిలోమీటర్లు సైకిల్ రైడ్



రాయదుర్గం: వీకెండ్ సైకిల్ రైడ్ ఉత్సాహంగా సాగింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ పర్యవేక్షణలో వ్యవస్థాపకుడు అశోక్ నాయకత్వంలో 25 కిలోమీటర్ల సైకిల్ రైడ్‌లో పాల్గొన్నారు. గచ్చిబౌలి హెచ్‌బీసీ వద్ద ప్రారంభమైన ఈ రైడ్ బయోడైవర్సిటీ పార్కు కూడలి, రాయదుర్గం, టోలిచౌకి, నానల్‌నగర్ కూడలి, లంగర్‌హౌజ్ మీదుగా గోల్కొండ వరకు సాగింది, అనంతరం తిరిగి అదేమార్గంలో హెచ్‌బీసీ బైక్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఔత్సాహికులు వీకెండ్‌లో ఉదయం 5.30 గంటలకు హెచ్‌బీసీ బైక్ స్టేషన్‌కు చేరుకుంటే పాల్గొనవచ్చని, సైకిళ్లు అందుబాటులో ఉంటాయని హెచ్‌బీసీ మేనేజర్ శ్రావణ్ తెలిపారు.

అక్బరుద్దీన్ ఒవైసీ మెజార్టీపై సర్వత్రా ఆసక్తి


అక్బరుద్దీన్ ఒవైసీ

చాంద్రాయణగుట్ట: వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. డబుల్ హ్యాట్రిక్ కొట్టేందుకు ఆరోసారి బరిలోకి దిగిన చాంద్రాయణగుట్ట ఎంఐఎం పార్టీ అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీ ఎంత మెజార్టీతో గెలుస్తారన్న విషయం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల సమయంలో అక్బరుద్దీన్ ఒవైసీ 95,339 ఓట్లు రాబట్టి బీజేపీ అభ్యర్థి సయ్యద్ షహజాదిపై 80,264 ఓట్ల మెజార్టీ సాధించారు. ద్వితీయ స్థానంలో సయ్యద్ షహజాదీ 15,075, తర్వాతి స్థానాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి 14,224, కాంగ్రెస్ అభ్యర్థి ఇసా బిన్ ఒబేద్ మిశ్రీ 11,309ల ఓట్లు మాత్రమే రాబట్టగలిగారు. గతంతో పోలిస్తే ఈసారి 12 వేల ఓట్లు అధికంగా పోలవ్వడం.. ప్రధాన పార్టీల అభ్యర్థులు హిందువులు కావడంతో ముస్లిం ఓట్లు తమకు గంపగుత్తగా పడి లక్ష మెజార్టీ వస్తుందని మజ్లిస్ శ్రేణులు అంచనాలు వేసుకుంటున్నాయి. వారి అంచనాలు ఎంత వరకు నిజం అవుతాయన్నది ఆదివారం వెలువడే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

రేపటి నుంచి అయ్యప్ప స్వాములకు ఆహార పదార్థాల పంపిణీ


ఆహార పదార్థాలను అందజేస్తున్న గాజుల అంజయ్య (ఫైల్)

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులకు రాబోయే 40 రోజుల పాటు ఉచితంగా ఆహార పదార్థాల పంపిణీ చేయనున్నట్లు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. గత 5 ఏళ్లుగా తాము ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే అయ్యప్ప స్వామి పూజల అనంతరం భక్తులకు టిఫిన్ బాక్స్‌లలో ఆహార పదార్థాలను అందజేయనున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏడాది ఉచిత ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. తమ వెంట ఖాళీ టిఫిన్ బాక్స్‌లను తీసుకుని వచ్చే అయ్యప్ప భక్తులకు ప్రతిరోజూ ఈ ఆహార పదార్థాలను అందజేయనున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారలు, చిరు వ్యాపారులు తాము విధి నిర్వహణకు వెళ్లేటప్పుడు ఖాళీ టిఫిన్లు తెచ్చుకుంటున్న వారికి ఈ ఆహార పదార్థాలను ఉచితంగా అందించనున్నామన్నారు. అయ్యప్ప దీక్ష స్వీకరించిన కొంత మంది భక్తులకు రోజు వారి విధి నిర్వహణలో సమయం సరిపోక పోవడంతో ఆహార పదార్థాలను సిద్ధం చేసుకోవడం కష్టసాధ్యమవుతుందన్నారు. అలాంటి వారి సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు ఉచితంగా ఆహార పదార్థాలను టిఫిన్లలో అందజేయనున్నామన్నారు.

రాయితీతో వైద్యసేవలందించాలని వినతి


కాంటినెంటల్ ఆసుపత్రి చైర్మన్‌తో మణికొండ రెడ్డి సంఘం నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 20 వేల వరకు ఉన్న రెడ్డీలకు రాయితీతో కూడిన నాణ్యమైన వైద్యసేవలను అందించాలని మణికొండ రెడ్డిసంఘం నాయకులు కాంటినెంటర్ ఆసుపత్రి చైర్మన్ గురువారెడ్డిని కోరారు. శనివారం సంఘం నాయకులు ఆయనను ఆసుపత్రిలో కలిశారు. ఈ సందర్భంగా తమ మున్సిపాలిటీకి సమీపంలోనే మీ ఆసుపత్రి ఉందని, రాయితీతో కూడిన వైద్యం అందిస్తే తమ సంఘం సభ్యులంతా మీ ఆసుపత్రి సేవలను అందుకుంటారని కోరారు. రెడ్డీల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తుందని, మీరు అండగా నిలవాలని కోరారు. ప్రతి విభాగానికి కమిటీలు వేసి వారి ద్వారా అన్ని రకాల సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు. రెడ్డి సంఘం నాయకులు నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీపతిరెడ్డి తదితరులున్నారు.

4న రుద్రహోమం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సోమవారం రుద్రహోమం ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి శనివారం తెలిపారు. ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం వరకు 108 సార్లు రుద్రహోమం నిర్వహించనున్నట్లు వివరించారు. గణపతి హోమం, బగలాముఖి హోమాలు జరుగుతాయని ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

అన్నదానం



గోల్కొండ: ఆస్పత్రులకు వచ్చే రోగుల సహాయకులకు రెండేళ్లుగా నిరంతరం రాత్రి భోజనం ఉచితంగా అందజేస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. శనివారం ఆయన పలు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని ఆయన అన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంతోష్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 1న మధ్యాహ్నం 2 గంటల సమయంలో చంపాపేట్ చెక్‌పోస్టు వద్ద 50–55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీంతో 108 అంబులెన్స్ సహాయంలో పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి రాత్రి 8.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య

అత్తాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వెంకటేశ్ కుమార్తె కావేరి (13) శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కాగా ఆమె గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్కూల్‌కు సరిగ్గా హాజరు కావడం లేదు. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న కావేరి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

తారానగర్-లింగంపల్లి రాకపోకలకు బ్రేక్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద సమస్య పరిష్కారానికి చేపట్టిన బాక్స్‌టైప్ కల్వర్ట్ నాలా పనులు కొనసాగుతున్నాయి. లింగంపల్లి విలేజ్ కమాన్ వద్ద కల్వర్టు పనులు చేపట్టడంతో తారానగర్ నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్‌లకు రాకపోకలను మళ్లించారు. లింగంపల్లి నుంచి తారానగర్‌కు వెళ్ళే వారు లింగంపల్లి విలేజ్ మీదుగా వెళ్ళాల్సి ఉంది. అదే విధంగా తారానగర్ నుంచి వచ్చే వారు లింగంపల్లి విలేజ్ లోపలి నుంచి అండర్ బ్రిడ్జి వరకు రావాల్సి ఉంది.

చెరువులను శుభ్రంగా ఉంచుకోవాలి


ముష్కిచెరువు పరివాహకం క్లినింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: చెరువుల పరివాహక ప్రాంతాన్ని కొందరు వ్యర్థాలకు కేంద్రాలుగా మారుస్తున్నారని, వాటి వద్ద ఎలాంటి చెత్తాచెదారాలను వేయొద్దని ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధుశికచౌదరి అన్నారు. శనివారం మణికొండ, నార్సింగి సరిహద్దులో ఉన్న ముష్కిచెరువు పరివాహకంలో సెయింటాన్స్ కళాశాల విద్యార్థినులు క్లీనింగ్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాటిల్లో మురికినీరు చేరకుండా వ్యర్థాలను వేయకుండా ఉంటే అవి ఆహ్లాదంగా ఉంటాయని, వాటిని శుభ్రంగా ఉంచేందుకు తమ సంస్థ వాలంటీర్ల సహకారంతో ఎంతో కృషి చేస్తుందన్నారు.

ఉత్తమ సాహితీవేత్త ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు


ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు పురస్కారం అందిస్తున్న అతిథులు

- యోగి వేమన విశ్వవిద్యాలయంలో అవార్డు అందజేత

రాయదుర్గం: సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును తమిళ సాంస్కృతిక పరిశోధనా కేంద్రం పాలక్కడ్ ఆధ్వర్యంలో శనివారం కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉత్తమ సాహితీవేత్త పురస్కారం అందజేశారు. కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం, తమిళ కల్చరల్ రీసెర్చ్ సెంటర్ పాలక్కాడ్, డీఏవీ కళాశాల ఆజ్మీర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వనవిల్‌కె రవి రచనల్లో భిన్న దృక్పథాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రసిద్ధ తమిళకవి, న్యాయవాది వనవిల్‌కె రవి, రాజస్థాన్ సెంట్రల్ యూనివర్శిటీ హిందీశాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఎన్ లక్ష్మీ అయ్యర్, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, పరిశోధక విద్యార్థులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్, ఆచార్య ఎన్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఉప్పలధడియం వెంకటేశ్వర, డాక్టర్ జిల్లెల బాలాజీ, వైవియు తెలుగుశాఖ అధ్యక్షురాలు ఆచార్య జి పార్వతి, ఆచార్యులు ఏజి దాము, పి రమాదేవి, వినోదిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు


మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: కార్తీకమాసంలో సామూహికంగా వనభోజనాలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం వద్ద వనభోజనాలను నిర్వహించగా.. సభ్యులంతా తరలివెళ్లారు. ఈనెల 10న అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీపార్కులో నిర్వహించే కార్తీక దీపోత్సవం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు.